# కారడవి

—వి.యస్. ప్రకాశరావు

అది శ్రావణ మాసంలో ఒక ముని మాపు. గోధూళి వేళ. ఆకాశం నిండా దట్టమైన మబ్బులు అలుముకున్నాయి. వర్షారంభ సూచనగా చలిగాలి మొదలైంది.

'చీకటిపాలెం' ఓ కుగ్రామం. పగలే జన సంచారం తక్కువ. గ్రామానికి కేవలం అర మైలు దూరంలోనే దట్టమైన అడవి మొదలవుతుంది. గ్రామాన్ని ఆనుకుని వున్న కొండల మీద కారు మబ్బులు కదలాడుతున్నాయి. మబ్బుల వలన మామూలు కన్నా ముందుగానే చీకటి పడింది.

ఉన్నట్టుండి పెద్ద పెద్ద చినుకులతో, వురుములతో వాన మొదలైంథి. ఆడుకుంటున్న పిల్లలు హడావిడిగా ఇళ్ళకి బయల్దేరారు. అప్పటికే ఆ మట్టి రోడ్డు తడిసిపోయింది. ఆ రేగడి మన్ను మీద జారి పడకుండా నడుస్తూ వెళ్ళేరు.

ఐదుగురైతే ఎవరి ఇళ్ళకు వాళ్ళు మళ్ళిపోయేరు. కాని అంతకుముందు అరుగు మీద కూచుని పాట పాడిన పార్వతి ఇల్లు మాత్రం కాస్త దూరం. మారెమ్మ గుడి మలుపు తిరగ్గానే వర్షం ఎక్కువైంది. చీకటి మరింత దట్టంగా అలుముకుంది. 'ఏ చూరు కిందయినా కాసేపునించుందా'మనుకుంటూ పక్కకి తిరిగింది పార్వతి. ఇంతలో మెరుపు మెరిసింది. తన వెనకగా ఎవరో ఆడ మనిషి నడుచుకుంటూ వస్తున్నట్టు అనిపించింది పార్వతికి.

ఆమె ఎవరో కాదు. గ్రామ పెత్తందారు గెరటయ్య విధవ చెల్లెలు ముత్యాలమ్మ.

''నువ్వటే పార్వతీ? ఇంత వానొచ్చేదాకా ఎక్కడ పెత్తనాలు చేస్తున్నావ్? సరేలే. ముందు మాయింటి కెళ్దాం నడు. మీ ఇల్లింకా శానా దూరం నడవాలి కదా? వాన తగ్గిం తర్వాత మీ యింటికెళ్ళొచ్చులే. నేనూ తడిసిపోయేను. రా'' అంటూ పార్వతి చెయ్యి పట్టుకుని సమీపంలో వున్న తమ మండువా లోగిలిలోకి దారి తీసింది ముత్యాలమ్మ.

వర్షానికి తడిసిన చిరుగుల గౌను ఒంటికి అతుక్కుపోయింది. చలికి గజగజలాడుతోంది పార్వతి.

పెరటి గదిలోకి తీసుకెళ్ళి తల తుడుచుకోమని తువ్వాలు అందించింది ముత్యాలమ్మ. పార్వతి మొగమాట పడలేదు. కాని భయపడింది. సంపన్నులు తనను అంతగా ఆదరించడానికి హేతువు కనిపించలేదు. తల తుడుచుకుంది.

ఒక పళ్ళెంలో అరిసెలూ, మరో పళ్ళెంలో కారప్పూస పెట్టి తెచ్చి ''కూచుని తిను'' అంది ముత్యాలమ్మ. పార్వతి తటపటాయించింది. ''తిను'' అంటూ ఆప్యాయంగా గద్దించింది ముత్యాలమ్మ.

అసలే ఆకలి మీదుంది. అందులోనూ భక్ష్యాలకు నోచని పేద యింట పుట్టింది. సంకోచం విడిచి ఆవురావురుమంటూ తిన సాగింది పార్వతి.

''ఇంకా కావాలా?'' అని జవాబు కోసం చూడకుండానే మరి రెండు అరిసెలు పళ్ళెంలో వేసింది ముత్యాలమ్మ. ఇంతలోనే ఇంటి యజమానురాలు పెద్దింట్లు అక్కడికి వచ్చింది.

''ఎవరూ? నువ్వా పార్వతీ? అయ్యయ్యో. బాగా తడసిపోయేవే. బట్టలు మార్చుకో. పొడి బట్టలిస్తాను. ఏం? పోనీ స్నానం చేసి మార్చుకుంటావా? అన్నట్టు నీ తలేంటి మరీ దుబ్బులాగుంది? తలంటు పోసుకోరాదా? సుబ్బరంగా తలంటుకుని పొడిబట్టలు కట్టుకో. మా యింట్లో కొత్త పరికిణీ జాకెట్టూ వున్నాయి. తొడుక్కుందూ గాని. పర్లేదులే.'' అంటూ పార్వతి మీద ప్రేమ కురిపించింది పెద్దింట్లు.

పార్వతి అయోమయంలో పడింది. ఇంత కాలం ఆమె అతుకు బొతుకుల గౌనులకే గాని పరికిణీలకి నోచుకోలేదు.

ఆకాశానికి చిల్లు పడినట్లు వర్షం అంతకంతకూ ఎక్కువ కాసాగింది. వర్షపు హోరూ, వురుముల ఆర్భాటం, చీకటి వానలో మెరుపుల మిరుమిట్లూ ఒక అర గంట ముందున్న వాతావరణాన్ని పూర్తిగా మార్చేశాయి.



పెద్దింట్లో, ముత్యాలమ్మా కలిపి పార్వతి తలంటు పోసి, కొత్త పరికిణీ జాకెట్టూ ధరింప జేశారు. పార్వతికిదంతా వింతగా అనిపించినా ఆ పేద పిల్ల మనసులో సంతోషపడింది.

భోజనాల వేళ ముత్యాలమ్మ పార్వతికి కొసరి కొసరి వడ్డించింది. "కడుపు నిండా తిను" అని పదే పదే బతిమాలింది. ఎంత పేద రాలైనా పొట్ట పట్టనంత తిన లేదు కదా! వడ్డించిన కూరలన్నిటి తోనూ తిని చివరికి గడ్డ పెరుగు కలిపిన అన్నం పూర్తిగా తినలేక విస్తట్లో విడిచి లేచింది పార్వతి.

పార్వతి ఎంగిలి విస్తరి తియ్యబోతుంటే ముత్యాలమ్మ వారించి తనే స్వయంగా ఆ పని చేసింది. ఆ పిల్లకిదంతా ఏదో కల లాగ వుంది.

బైట వర్షం తగ్గలేదు. పైగా విపరీతమైన గాలితో తుఫాను వాతావరణం మొదలైంది.

"ఈ గాలి వాన ఈ రాత్రికి తగ్గేటట్టు లేదు. పోనీ ఈ రాత్రికిక్కడే వుండిపో. రేపొద్దున్నే మీ ఇంటికి కెళ్ళొచ్చు" అంది పెద్దింట్లు పార్వతితో.

ఆ సమయానికి ఇంటి యజమాని గెరటయ్యే కూడా అక్కడికి వచ్చి పార్వతిని వుండి పొమ్మ న్నాడు. మరో దారి లేక తలూపింది పార్వతి.

* * *

రాత్రి పదకొండు గంటల సమయం. తుఫాను ఉధృతి హెచ్చింది. చాప మీద నిద్రపోతున్న పార్వతిని లేపింది ముత్యాలమ్మ. పూర్తిగా మెల కువ రాని పార్వతిని దాదాపు ఈడ్చుకెళ్ళింది ముత్యాలమ్మ. పెరటి గదిలోంచి నట్టింట్లోకి పార్వతిని బలంగా తోసింది ముత్యాలమ్మ.

అకస్మాత్తుగా తోసిన తోపుకి నట్టింట్లో పడింది పార్వతి. తోసిన ముత్యాలమ్మ అవతలే వుండిపోయి, వెంటనే తలుపులు కూడా మూసింది.

కిందపడిన పార్వతి తేరుకునే లోగానే గెర టయ్యే మేనమావ పోతురాజు ఆమె చేతులు వెనక్కి విరిచి కట్టేశాడు. అంతలోనే గణాచారి మరిడయ్య పార్వతి నోట్లో గుడ్డ కుక్కేశాడు. గెరటయ్యే కొడుకు కనకారావు ఆమె కాళ్ళు కూడా కట్టేశాడు. దాంతో పార్వతి లేవలేక పోయింది.

గెరటయ్య పెద్దింట్లో ఉగ్రకాళి పటం ముందు భక్తిగా చేతులు జోడించి కూర్చుని వున్నారు.

పార్వతి కళ్ళలో అంతులేని భయం సంభ్రమం. "పిశాచ గణ సమవాకారం"లా వున్న ఆ మనుషుల్ని చూడగానే ఏదో ఘోరం జరగ బోతున్నదని ఆ పాపకు తెలిసిపోయింది. ఆమె ప్రమాదాన్ని పసిగట్టింది. ఎంతో గింజుకుంది. ఆ చిన్నారి మనసు ఆ పరిస్థితిని తట్టుకోలేక విల విల్లాడిపోయింది.

ధూపం వేశాడు మరిడయ్య. ఘాటైన పొగ దట్టంగా అలుముకుంది. దేవికి పూజ చేసిన కుంకుమ తెచ్చి పార్వతి నుదుట బొట్టు పెట్టేడు. నుదుటి నిండా కుంకుమ అద్దుకుని భయానకంగా వున్న మరిడయ్య తనను సమీ పించగానే పార్వతి స్పృహ తప్పి పడిపోయింది.

రాత్రి ఒంటి గంట దాటింది. కార్యక్రమం పూర్తియింది. అందరూ నట్టింట్లోకి చేరేరు. ఆ చోటు వానా బీభత్సంగా వుంది.

"ఇదిగో గెరటయ్యా! పూజె మొత్తం బ్రెమ్మాండంగా జరిగింది. పూజె చేసినంత సేపూ 'గల్లు గల్లు'మని లచ్చి తల్లి గజ్జెల సప్పుడు నాకు యినపడతానే వుంది. ఈ గాలి వాన నీకు సుబసూచెన. మీరు తవ్వకం జాగర్తగా సెయ్యాలి. మరీ మరీ సెపుతున్నా, మనసులో అనుమానం పెట్టుకుంటే మట్టి తప్ప మరేది దొరకదు. మీ అదృష్టం కొద్దీ ఈ పూజె సెయ్యటానికి అణి మాదిసిద్దులు గలిగినోళ్ణే నేను దొరికేను. రేపీ పాటికి మీ యిల్లంతా బంగారవే. కోటీస్వరులై పోతారు" అన్నాడు మరిడయ్య.

వాళ్ళందరి కళ్ళలోనూ విపరీతమైన పేరాశ.

"తొలి కోడి కూసేలోగా నేనీ పొలిమేర యిడిసిపెట్టాలి. అది సేస్త్రం. నన్ను తొందరగా పంపించెయ్యి" అంటూ తొందర పెట్టేడు మరిడయ్య.

గెరటయ్య ఓ కాసు బంగారం, వెయ్యి నూట పదహార్లూ తెచ్చి మరిడయ్య కిచ్చేడు. గెరటయ్య పెద్దింట్లో మరిడయ్యకి పాదాభివందనం చేశారు.

## పచ్చి మిర్చి క్రీమ్

పచ్చి మిర్చితో నరాల నెప్పులు మటుమాయం అంటే మీరు నమ్ముతారా? దక్షిణ అమెరికాలో ఈ పచ్చి మిర్చి క్రీమ్ తయారుచేసి చర్మ బాధా నివారిణిగా ఉపయోగిస్తున్నారుట. అమెరికన్ డయాబెటీస్ అసోసియేషన్ రిపోర్టు ప్రకారం, చేతులు పాదాల వద్ద మంటలు పోటుతో బాధపడే రోగుల్లో ఈ క్రీమ్ సత్వర తాల్ని ఇచ్చిందిట! ఇక పచ్చిమిర్చి ధర కూడా ఆకాశాన్ని అంటి పేరు చెబితేనే మంట నసాళానికి అంటుతుందంటారా?

—సేకరణ : అచ్యుతుని రాజ్యశ్రీ

బయట వర్షం తగ్గుముఖం పట్టింది కాని గాలి తీవ్రత తగ్గలేదు.

కనకారావు మరిడయ్యను వెంటబెట్టుకుని వెళ్ళి చీకట్లో వూరి పొలిమేర వరకూ సాగనంపి వచ్చేడు. మరిడయ్య డొంక దారి పట్టి వడివడిగా నడుచుకుంటూ వెళ్ళిపోయేడు. వాళ్ళను ఎవరూ గమనించలేదు.

అప్పటి కింకా ఆ నట్టింట్లో పార్వతి నిర్జీవ శరీరం అలాగే పడి వుంది.

* * *

అడవి దారి, దారికి అటు ఇటూ గజిబిజిగా పెరిగిన చెట్లు, పొదలూ. రాత్రి మూడు గంటల సమయం. అప్పటికి గాలివాన తగ్గిపోయింది. సన్నగా తుంపర పడుతోంది. కీచురాళ్ళ బృందగానం అడవి ప్రశాంతతను భంగపరుస్తోంది.

ఆ సమయంలో యానాది సైదులూ, పేటోళ్ళ పిలగంగడూ ఆ దారిన వస్తున్నారు. సైదులు పాముల్ని పట్టి, వాటి చర్మాల్ని కారుచౌకగా బస్తీలో ఓ వర్తకుడికి అమ్ముతుంటాడు.పిలగంగడు అతనికి శిష్యుడు. ఇద్దరూ కలిసి అడవిలో తిరిగి తిరిగి వస్తూ ఆసాయంత్రం వర్షానికి దొరికిపోయి, దగ్గర్లో వున్న కోయగూడెంలో తలదాచుకున్నారు. వాన వెలిసిన తర్వాత వూరి వైపు బయల్దేరారు. కటిక చీకట్లో అడవులెంబడి పోవడం వాళ్ళ కలవాటే.

నడుస్తున్న సైదులు హఠాత్తుగా ఆగిపోయాడు. పిలగంగడు సైదులు వంక ఆశ్చర్యంగా చూశాడు. సైదులు దగ్గర్లోనేవున్న ఓ చెట్టు పక్కకి తప్పుకున్నాడు. అక్కణ్ణించి పిలగంగడికి ఓ దృశ్యం చూపించేడు.

ఇరుకైన ఆ అడవిదారి పక్కనేవున్న చింత చెట్టుకి ఓ సైకిలు ఆనించి వుంది. దాదాపు ఏభై గజాల దూరంలో దట్టంగా పెరిగిన అడవి పొదల వెనక ఓ సిరిమాను చెట్టు క్రింద ఇద్దరు వ్యక్తులున్నారు. ఒకడు గునపంతో గొయ్యి తవ్వుతోండగా మరొకడు మట్టి పక్కకు తీస్తున్నాడు. వాళ్ళున్నచోట ఓ గోనె మూట వుంది. ఆ గోనె మూటలోంచి మనిషి కాళ్ళు మడమల వరకూ బయటికి కనిపిస్తున్నాయి.

తవ్వకంలో మునిగిపోయిన మనుష లిద్దరూ వాళ్ళను గమనించలేదు.

తవ్వుతున్న కనకారావునీ, మట్టితీస్తున్న పోతురాజునీ వాళ్ళు పోల్చుకున్నారు.

అక్కడ జరిగిన కార్యక్రమాన్నంతా సైదులూ, పిలగంగడూ వూపిరి బిగబట్టుకుని చూశారు.

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

జీవితంలో అనేక విషనాగుల్ని సైతం చాక చక్యంగా పట్టి వాటి కోరలు పెరికిన ఆ ఇద్దరూ ఆ నరరూప రాక్షసుల చర్యను చూసి విపరీతంగా చలించిపోయేరు.

వర్షం పూర్తిగా తగ్గింది. అడపా దడపా చెట్ల ఆకుల కొసల నుంచి నీటి చుక్కలు కన్నీటి బొట్ల మాదిరిగా జారుతున్నాయి.

తూర్పు తెల్లారింది. కరాళ కాళరాత్రి తన కడుపున దాచిపెట్టుకున్న భయంకర రహస్యం వెలుగుచూసింది.

* * *

"మైగాడ్. ఎంత ఘోరం జరిగింది! ఇంతకీ ఈ దారుణం జరిగి ఎన్నాళ్ళయింది?" అని అడిగేరు కలెక్టరుగారు బంగ్లా ముందున్న లాన్ వైపు దారితీస్తూ.

"ఇవ్వేటికి సరిగ్గా ఇరవై రోజులైంది సర్" అంది ప్రసూన కలెక్టరుగార్ని అనుసరిస్తూ.

"అసలు ఈ వివరాలు మీకెలా తెలిశాయి?" ప్రసూన పక్కనే నడుస్తున్న కలెక్టరు భార్య అడిగింది.

"నేను సోషియాలజీలో లెక్చరరుగా పనిచేస్తున్నాను మేడమ్. 'మారుమూల గ్రామాల్లో సాంస్కృతిక వికాసం' అనే అంశం మీద వచ్చే నెలలో ఓ సెమినార్ జరుగుతుంది. ఆ సెమినార్‌లో సబ్మిట్ చెయ్యాల్సిన పేపరు కోసం నేను ఎంచుకున్న ఐదు గ్రామాల్లో దీకటిపాలెం ఒకటి. ఆ గ్రామంలో నేనొక రైతు కుటుంబంతో నాలుగు రోజులున్నాను. ఆ ఇంటివాళ్ళ అబ్బాయి ఆ గ్రామంలో యువజన సంఘం ఒకటి పెట్టాడు. అతని ద్వారా కొన్ని వివరాలు తెలిశాయి. ఆ తర్వాత అతి కష్టం మీద వూరి వాళ్ళతో కూడా మాటాడేను" అంది ప్రసూన.

ముగ్గురూ లాన్‌లో కుర్చీలో కూర్చున్నారు. నౌకరు వారికి టీ తెచ్చి యిచ్చాడు.

"మరి ఆ వూరి వాళ్ళు ఇన్నాళ్ళూ ఏం చేస్తున్నారు?" అడిగారు కలెక్టర్‌గారు టీ తాగుతూ.

"జరిగిన ఘోరం తెలిసిన వెంటనే ప్రజలు గెరటయ్య ఇంటిని చుట్టు ముట్టేశారు. గెరటయ్యా, అతని భార్య నట్టిల్లు నిలువులోతున తవ్వుకుని నిధి ఏదో దొరక్క పిచ్చెత్తిపోయి వున్నారు. ఆ సమయానికి సర్పంచ్ వగైరా పెద్దలంతా వచ్చి, అతి కష్టం మీద జనాన్ని శాంతపరిచేరు. పోలీసు రిపోర్టు యిస్తామని ప్రజలకి వాగ్దానం చేశారు. కాని ఇవ్వలేదు."

"పోలీసులకీ సంగతి తెలుసా?" కలెక్టరు భార్య అడిగింది.

### గ్రేట్ పిరమిడ్ కొలత

"ఫాదర్ ఆఫ్ జామెట్రీ"గా పేరు గాంచిన యూక్లిడ్ అలెగ్జాండ్రియా యూనివర్సిటీలో లెక్కల ప్రొఫెసర్. అసాధ్యం అని అందరూ పెదవి విరిచే పనిని సుసాధ్యం చేసిని చూపే వాడు. గ్రేట్ పిరమిడ్‌ని కొలవడం మనిషితరం కాదని అతని సహోద్యోగులు ఛాలెంజ్ చేశారు. అవకాశం కోసం వేచి వున్న యూక్లిడ్ తన నీడ, తన శరీరపు పొడవు సరిగ్గా ఒకే సైజులో వున్న క్షణంలో తన సహచరుల కిలా చెప్పాడు — "ఇప్పుడు పిరమిడ్ నీడని కొలవండి. అదే అసలు సిసలైన పిరమిడ్ ఎత్తు." ఎంత గమ్మత్తుగా ఎప్పటిదో చిక్కుముడిని చూడండి! అలె గ్జాండ్రియా రాజుకి ఇతని జామెట్రీ బోధన బుర్రకెక్కేవి కాదు. "జామెట్రీ సులభంగా నేర్చుకునేందుకు షార్ట్ కట్ పద్ధతి లేదా?" అని ప్రశ్నిస్తే, "ప్రభూ! తమ రాజ్యానికి బాట లున్నాయి కానీ ఈ జామెట్రీలో మాత్రం అందరికీ ఒకే బాట" అని తెగేసి చెప్పాడు యూక్లిడ్.

—సేకరణ : అచ్యుతుని రాజ్యశ్రీ

"తెలుసు మేడమ్. కాని వాళ్ళకి ఈ రోజు వరకూ రిపోర్టు లేదు. గ్రామ పెద్దలు తమ లౌక్యాన్నీ, కుటిలత్వాన్నీ వుపయోగించిన ఈ సంఘటన ప్రభుత్వ రికార్డులోకి ఎక్కకుండా జాగ్రత్తపడ్డారు. బంధుత్వాన్నో, కులత్వాన్నో అడ్డు పెట్టుకుని యువజన సంఘం సభ్యులను బుజ్జగించేరు. అవసరమైతే బెదిరించేరు" అంది ప్రసూన.

"ఆ అమ్మాయి తల్లి పరిస్థితి ఏమిటి?" అడిగింది కలెక్టరు భార్య.

"ఏం చెప్పమంటారు మేడమ్? భర్త చనిపోయి ఆరేళ్ళయింది. అప్పట్నుంచీ ఆ యింటా ఈ యింటా పని చేసుకు బతుకుతోంది. ఒక్కగానొక్క కూతురు అన్యాయంగా బలైపోయిందన్న ఆవేదనతో ఆమె కృంగిపోయింది. 'పోయిన బిడ్డ ఎలాగూ రాదు గనక ఓ రెండు వేలు తీసుకోమ'ని గ్రామ పెద్దలు బలవంతం చేశారు."

"తీసుకుందా?" అడిగేరు కలెక్టరుగారు.

"ఓ పది రోజుల పాటు తీసుకోలేదు. కానీ..."

"కానీ...?"

"ఆమె ఎంత పేదరాలంటే తన జీవితంలో వెయ్యి రూపాయిలెప్పుడూ కళ్ళ చూడలేదు. జీవితం చాలా కర్కశమైనది సర్. ఆ కర్కశత్వం ముందు కొన్ని విలువలు తలవంచక తప్పదు."

"ఐసీ" ఆలోచనలో పడిపోయారు కలెక్టర్‌గారు.

"ఈ రోజుల్లో కూడా ఇలాంటివి జరుగుతాయంటే నమ్మలేం" అంది కలెక్టరు భార్య.

"కాని జరుగుతున్నాయి మేడమ్. అదే విచిత్రం. జరుగుతున్నవన్నీ బయటి ప్రపంచానికి తెలియక పోవచ్చు. ఇంకా విచిత్ర మేమిటంటే ఇంత జరిగినా తమ యింట్లో లంకె బిందెలున్నాయనే గెరటయ్య కుటుంబం నమ్ముతోంది. పూజలో ఏదో లోపం జరిగి వుంటుందని వాళ్ళు అనుకుంటున్నారు. వాళ్ళు దేనికైనా బాధపడుతున్నారంటే అది నిధి చేతికందలేదనే" అంది ప్రసూన.

"ఎంత అమానుషం! అలాంటప్పుడు మనం సాధించిన నాగరికత గురించి గొప్పలు చెప్పకోవడంలో అర్థం లేదు"

"అవును మేడమ్. సమాజం మారాలనుకునే వాళ్ళు ఆ మార్పు ఎక్కణ్ణించి ఆరంభం కావాలో ఈ సంఘటన ద్వారా తెలుసుకోవాలి."

ఆలోచన నుంచి తేరుకున్న కలెక్టరుగారు లేచి, పోలీసు సూపరింటెండెంట్‌తో మాట్లాడడానికి ఫోన్ దగ్గరకెళ్ళారు. ఫోన్ ముట్టుకోబోతుండగానే మోగింది.

"హలో. ఎవరు? కలెక్టరుగారేనా? నేను పార్లమెంటు మెంబరు సహస్ర ఫణీశ్వరరావుని మాటాడుతున్నాను. ఇవేళో రేపో మీ దగ్గరికి ఓ ఆడ లెక్చరరు రావచ్చు. ఆవిడ దీకటిపాలెంలో జరిగిన ఓ ఇన్సిడెంటు గురించి మీకు రిపోర్టు చెయ్యొచ్చు. ఆ డీటేల్స్ మీకు విడిగా మజ్జాన్నం వచ్చి చెబుతాను కలెక్టరుగారూ! విషయమేమిటంటే ఇందులో ఇన్వాల్వ్ అయిన వాళ్ళు మనకి చాలా కావలసిన వాళ్ళు. వాళ్ళకి స్టేట్ లెవల్లో చాలా ఇన్‌ఫ్లుయన్స్ బంధువులున్నారు. అంచేత ఈ ఇష్యూని ఏ రకంగా డీల్ చెయ్యాలో కేర్‌ఫుల్‌గా ఆలోచించండి. మీకూ, నాకూ మాట రాకుండా చూసుకోవాలి. ఐనా కలెక్టర్‌గారూ కందకిలేని దురద కత్తిపీటకన్నట్టు వచ్చిందాని తల్లికి కాంపెన్సేషను పారేసి నోరు మూయించిం తర్వాత ఎవర్తో ఔట్‌సైడరొచ్చి ఆ విలేజ్ ఇంటర్నల్ ఎఫైర్స్‌లో ఇంటర్‌ఫియరవు తానంటుదేవిటి? కలెక్టరుగారూ. వింటున్నారా? ఓ.కే. నేను మజ్జాన్నం వొచ్చి కలుస్తాను. శలవు"

కలెక్టరుగారి ముఖంలో రంగులు మారేయి. పెదాలు వణుకుతోండగా యాంత్రికంగా ఫోను జారవిడిచాడు. "సమాజం మారాలనుకునే వాళ్ళు ఆ మార్పు ఎక్కణ్ణుంచీ ఆరంభం కావాలో ఈ సంఘటన నుంచీ తెలుసుకోవాలి" కలెక్టర్ చెవుల్లో పెద్ద హోరు! ●